
మంగళగిరి కేంద్ర కార్యాలయంలో మంగళవారం సీఎం చంద్రబాబునాయుడును కలిసిన గెలుపొందిన ఎమ్మెల్సీలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరం, ప్రక్కన మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, మనోహర్



- తొలి ప్రాధాన్య ఓట్లలోనే 82,320 ఆధిక్యం
- రౌండురౌండుకూ భారీ మెజార్టీతో ప్రభంజనం
- తొమ్మిది రౌండ్ల అనంతరం అధికారిక గెలుపు ప్రకటన
- కలెక్టరేట్‌లో ఆలపాటికి డిక్లరేషన్ అందజేసిన కలెక్టర్
- బాణసంచా పేల్చి, స్వీట్ల పంపిణీ.. అంబరాన్ని అంటిన సంబరాలు
- 24 గంటల పాటు కొనసాగిన పట్టభద్రుల ఓట్ల లెక్కింపు

ఆలపాటి అఖండ విజయం

గుంటూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అఖండ విజయాన్ని అందుకున్నారు. బరిలో సిట్టింగ్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్నప్పటికీ ఒకవిధంగా ఈ ఎన్నికలు ఏకపక్షంగానే కొనసాగాయి. ఓటరు నమోదు ప్రక్రియ మొదలుకుని లెక్కింపు ముగిసేవరకు కూడా టీడీపీ హవానే కొనసాగింది. ఈ ఎన్నిక పీడీఎఫ్ చరిత్రలో గట్టి ఎదురుదెబ్బే తగిలింది. పట్టభద్రులు అందించిన తిరుగులేని విజయంతో టీడీపీపై రెండు ఉమ్మడి జిల్లాల ప్రజల్లో ఉన్న విశ్వాసం ఏమాత్రం చెక్కుచెదరలేదని స్పష్టమైంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు దాదాపుగా 24 గంటల పాటు కొనసాగింది. సోమవారం ఉదయం ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో ముగిసింది. తొలి రౌండ్ కౌంటింగ్‌లోనే ఆలపాటి 9980 భారీ మెజార్టీ సాధించారు. ఆ తర్వాత రౌండ్లలోనూ అదే ఒరవడి కొనసాగించడంతో మూడో రౌండ్ లెక్కింపు పూర్తి అయ్యేసరికే ఆలపాటి భారీ విజయం సాధిస్తారని తేలిపోయింది. దాంతో పీడీఎఫ్ ఏజెంట్లు ఒక్కొక్కరుగా కౌంటింగ్ హాల్ వీడారు. కాగా రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, డీఆర్‌వో ఖాజావలి పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ వేగవంతంగా సాగింది. 2వ రౌండ్‌లో 10785, మూడో రౌండ్‌లో 9318, నాల్గో రౌండ్‌లో 8408, 5వ రౌండ్‌లో 9381, 6వ రౌండ్‌లో 10184, ఏడో రౌండ్‌లో 9196, ఎనిమిదో రౌండ్‌లో 9699, తొమ్మిదో రౌండ్‌లో 5369 మెజార్టీ కలిపి (మిగతా 6వ పేజీలో)

ఆలపాటి రాజకీయ ప్రస్థానం

- 1985లో తెలుగు యువత నేతగా రాజకీయ ప్రవేశం
- 1994లో వేమూరు నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యే.1999లో రెండోసారి వేమూరు నుంచి విజయంతో మంత్రి పదవి
- 2014లో తెనాలి నుంచి ఎమ్మెల్యేగా విజయం.



మీడియా పాయింట్లో ఆలపాటి విజయ సంకేతం

కూటమిలో జోష్..

ఫలితాలతో వైసీపీ శిబిరం నిస్తేజం

వైసీపీ పాలనలో కళావిహీనమైన రాజధానికి కొత్త వెలుగులు తెచ్చి యావత్ ప్రపంచం దృష్టి ని ఆకట్టుకునేందుకు సీఎం చంద్ర బాబు నాయుడు వేస్తున్న అడుగులకు పట్ట భద్రులు మరింత బలం చేకూర్చారు. కూటమి అభ్యర్థికి ప్రత్యర్థిగా నిలబడిన అభ్యర్థి కంటే రెండు రెట్లు కు పైగా ఓట్లేసి అఖండ మెజార్టీతో గెలిపించి కూటమి ప్రభుత్వాన్ని ఓటర్లు ఆశీర్వదించారు. విశేషమేమిటంటే పోల్ అయిన ఓట్లలో 89 శాతం మాత్రమే చెల్లుబాటైనా అందులో 67.5 శాతం ఓట్లను కూటమి అభ్యర్థికి పడటంతో టీడీపీ, బీజేపీ, జనసేన కేడర్‌లో ఉత్సాహం ఉరకలేసింది. కాగా కూటమి అభ్యర్థిని ఓడిం చేందుకు వైసీపీ ముఖ్య నేతలు కొందరు ప్రత్యక్షంగా, మరికొందరు పరోక్షంగా ప్రయత్నించారు. ఇక ఏకంగా ఆ పార్టీ పత్రిక కూటమి అభ్యర్థిపై అబద్దపు రాతలతో విషం చిమ్మినా విద్యావంతులు నమ్మలేదు. బరిలో ఉంది తమ పార్టీ అభ్యర్థి కాదని కేడర్‌కు ధైర్యం చెబు తున్నా కూటమి అభ్యర్థి సాధించిన ఘన విజయం తో వైసీపీ శిబిరంలో నిస్తేజం నెలకొంది. ఈ ఎన్ని కల్లో కూటమి అభ్యర్థి ఓడితే ప్రభుత్వంపై వ్యతిరేక త పెల్లుబుకిందని, రాజధాని ప్రాంతంలో ఆదరణ కోల్పోయిందని ప్రచారం చేయాలని వైసీపీ నేతలు చేసిన ఆలోచన ఫలితాలతో తలకిందులైంది.



కౌంటింగ్ కేంద్రం వద్ద బాణ సంచాతో సంబరాలు

సంక్షేమం.. సులభం

- అర్హులకు అందించేందుకు చర్యలు
- కొలిక్కివచ్చిన ఇళ్ల జియో ట్యాగింగ్ ప్రక్రియ
- బాపట్లలో 99 శాతం.. గుంటూరు, పల్నాడు జిల్లాలు వెనకంజే

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేస్తుంది. అయితే ఆ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు అందుతున్నాయా అంటే అనుమానమే. అనర్హులు కూడా ఎందరో సంక్షేమ ఫలాలు అందుకుంటున్నారని అధికారుల విచారణల్లో వెల్లడవుతోంది. ఈ పరిస్థితుల్లో కుటుంబాలు ఎన్ని.. వారి స్థితిగతులు ఏమిటి అనే డేటా ప్రభుత్వం వద్ద ఉంటే సంక్షేమాన్ని సులభంగా అందించవచ్చని కూటమి ప్రభుత్వం భావించింది. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా వైసీపీ అనుయాయులకు పెద్దఎత్తున లబ్ధి చేకూర్చారు. ఈ పరిస్థితుల్లో సంక్షేమం అర్హులకు మాత్రమే అందించాలని నివాసాల జియో ట్యాగింగ్ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమాన్ని పక్కాగా అర్హులకే అందించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం దీని ద్వారా జిల్లాల వారీగా ఇళ్లకు సంబంధించి క్షేత్రస్థాయి వాస్తవ లెక్కలు, ఎంతమంది స్థానికంగా నివాసం ఉండడం లేదనే గణాంకాలతో పాటు గత ప్రభుత్వంలో అర్హత లేకుండా ఎన్ని కుటుంబాలు సంక్షేమ ఫలాలు అందుకున్నాయనే వివరాలు ఈ జియో ట్యాగింగ్ ద్వారా వెల్లడి కానున్నాయి. ఇకపై కూటమి ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలలో పారదర్శకత కోసం జియో ట్యాగింగ్ ప్రక్రియ దోహదకారిగా ఉండనుంది. గతేడాది నవంబరులోనే ఇళ్ల జియో ట్యాగింగ్‌ను సచివాలయ సిబ్బంది ద్వారా ప్రభుత్వం చేపట్టింది. ఇకపై సంక్షేమ పథకాల అమలులో జియో ట్యాగింగ్ డేటానే కీలకం కాబోతుందని అధికారులు చెబుతున్నారు. ఇళ్ల లెక్కతో పాటు కుటుంబసభ్యుల సంఖ్య, ఇతరాత్ర ఆర్థిక స్థితిగతులు, స్థానికంగా ఉండని వారెవరూ ఇలా అన్ని అంశాలు ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి అందుబాటులో వచ్చాయి. ఇళ్ల జియో ట్యాగింగ్ పూర్తి అయితే సంక్షేమ పథకాలు అర్హులకు అందించడం ప్రభుత్వానికి సులభంగా మారనున్నది. జియో ట్యాగింగ్ సహకారంతో ఎంత మంది అనర్హులు లబ్ధి పొందారన్న గణాంకాలు కూడా తేటతెల్లమవుతున్నాయి. పింఛన్లకు సంబంధించి ఇటీవలే వడపోత చేపట్టి అర్హులైన మరో 2,200 మందికి తాజాగా లబ్ధి చేకూర్చింది. ఉద్దేశపూర్వకంగా నిధులు కైంకర్యం చేసిన వారిపై అవసరమైతే రికవరీ యాక్టు అస్త్రాన్ని ప్రయోగించడానికి కూడా ప్రభుత్వం సిద్ధమవుతోంది. వీటికి ఊతంగా ఈ ఇళ్ల జియో ట్యాగింగ్ ప్రక్రియ నిదర్శనంగా నిలవనుంది. మరో వారం రోజుల్లో వంద శాతం పూర్తవుతుందని సంక్షేమం సులభతరం చేయడంలో జియో ట్యాగింగ్ ఉపయోగపడుతుందని యంత్రాంగం ఆశిస్తోంది. బాపట్ల జిల్లాలో 99 శాతం ఇళ్ల జియో ట్యాగింగ్ పూర్తవగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇంకా ట్యాగ్ కావాల్సిన ఇళ్ల (మిగతా 8వ పేజీలో)



నిజాంపట్నంలో ఇళ్లకు జియో ట్యాగింగ్ చేపడుతున్న సిబ్బంది (పాత చిత్రం)

పదివేల ఇళ్లు మాయం

నివాసాల జియో ట్యాగింగ్‌కు సంబంధించి సచివాలయ సిబ్బందికి వార్డుల వారీగా డేటా ఇచ్చి జియో ట్యాగింగ్‌కు పురమాయించారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ డేటాతో పోలే ఇళ్ల నెంబర్లు కనిపించడం లేదు. గత ప్రభు త్వంలో జరిగిన అవకతవకలకు ఇదే నిదర్శనంగా కనిపిస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే దాదాపు పదివేల ఇళ్ల వరకు క్షేత్రస్థాయిలో లేకుండా రికార్డుల్లో చూపించారని సిబ్బంది గుర్తించారు. మరో వైపు ఏళ్ల తరబడి అక్కడ నివాసం ఉండకపోయినా లెక్కల్లో స్థానికంగానే ఉన్నట్లు చూపించిన కుటుంబాల సంఖ్య కూడా గణనీయంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

స్నాతకోత్సాహం



గుంటూరు వైద్య కళాశాల 74వ స్నాతకోత్సవం 'కార్డియా 25' జింకానా ఆడిటోరియంలో మంగళ వారం జరిగింది. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఉప కులపతి, రాష్ట్ర వైద్య విద్య సంచాల కులు(డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం 2019 బ్యాచ్ విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. గ్రాడ్యుయేషన్ డేతో కళాశాలలో కోలాహల వాతావరణం నెలకొంది. 8

- గుంటూరు మెడికల్ (ఆంధ్రజ్యోతి)



సర్వమత స్వర్గధామం

- హిందూ, ముస్లిం, క్రైస్తవుల స్మార్ట్ ఐక్య అంత్యక్రియల కేంద్రం
- ఆధునిక వసతులు.. సకల సౌకర్యాలు
- తుళ్లూరు సమీపంలోని శాఖమూరు రోడ్డులో ఏర్పాటు
- నూతన సంస్కరణలకు తెరదీసిన సీఆర్‌డీఏ

రేపటి నుంచి గుడారాల పండుగ 8

7 నుంచి సాగరమాత ఉత్సవాలు 6

నాడు అవస్థలు.. నేడు రయ్‌రయ్

- రూ.80 లక్షలతో మిట్టగుడిపాడు- సమాధానంపేట రోడ్డు
- యరపతినేని, జూలకంటి సంయుక్త కృషిపై ప్రజల హర్షం

రెంటచింతల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అడుగుకో గుంత.. రాళ్లు తేలిన రోడ్డుతో గతంలో వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే రహదారిపై ప్రస్తుతం రయ్‌రయ్‌మంటూ వాహన చోదకులు ప్రయాణం సాగిస్తున్నారు. గత వైసీపీ పాలనలో రోడ్ల దుస్థితిపై పాలకులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది. గురజాల నుంచి గొట్టిముక్కల మీదగా సమాధానం పేట వరకు వెళ్లే రోడ్డంతా గోతులతో నిండి ఉన్నది. దీంతో ఎమ్మె ల్యేలుగా గెలుపొందిన వెంటనే మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలు బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివా స రావుఈ రోడ్డు బాగుకు ప్రత్యేకంగా కృషి చేశారు. ఎస్‌డీఎంఎఫ్(స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్) కింద మిట్టగుడిపాడు నుంచి సమాధానంపేట వరకు 4 కి.మీకు రూ.20 లక్షలు, 12 కి.మీకు రూ.60 లక్షలు కేటాయించారు. దీంతో రూ.80 లక్షలతో రహదారిని పునర్‌నిర్మించారు. ఆయా గ్రామల ప్రజల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది. ఇద్దరు ఎమ్మెల్యేలకు వాహనచోదకులు కృతజ్ఞతలు తెలిపారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.30 (బుధవారం)
సహరి : 5.10 (గురువారం)



మిట్టగుడిపాడు సమాధానం పేట రోడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ఉద్యోగినులను గౌరవించుకోవాలి

- మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శాఖల వారీగా మహిళ ఉద్యోగులను గౌరవించుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. జిల్లాలో మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవ కార్యక్రమాల నిర్వహణపై స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్పీ కంచి. శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో వారోత్సవాల నిర్వహణకు ఐసీడీఎస్ పీడీ ఉమాదేవిని ప్రత్యేకంగా నియమించామన్నారు. 6న మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. పోటీలలో ఉత్తమ ప్రదర్శన చూపిన మహిళలకు మహిళా దినోత్సవం రోజున ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మురళి, జిల్లా అటవీశాఖాధికారి కృష్ణప్రియ, రెవెన్యూ అధికారి మధులత తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు అంత సంపద ఎలా వచ్చింది ?

● అధికారం అండతో అడ్డగోలుగా దోపిడి
● అసెంబ్లీలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఫైర్


మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డంపెట్టుకొని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష కోట్ల రూపాయలకు పడగలెత్తారని, 2004 ఎన్నికల అఫడవిట్‌లో కేవలం రూ.2 కోట్ల ఆస్తులు చూపించిన వ్యక్తి అధికారంలోకి వచ్చాక 50 కంపెనీలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా జగన్ అధిపతి అయ్యాడని, ఇంత సంపద ఎలా వచ్చిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చావేదిక సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనను దొరికిన కాడికి దోచుకోవడం, దాచు కోవడంతోనే సరి పుచ్చాడని, సంపద సృష్టి ఊసు లేకుండా రాష్ట్రాన్ని దివాళ తీయించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని పది లక్షల కోట్ల అప్పుల్లో ముంచాడని, వారి ఐదేళ్ల పదవి కాలంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొని ఉందన్నారు. పాఠశాలలకు ఇచ్చిన కోడిగుడ్లు, చిక్కీలకు వందల కోట్లు పెండింగ్ పెట్టారని సంక్షేమానికి రూ.2.7 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు సరే తెచ్చిన అప్పుల్లో మిగిలిన డబ్బులు ఏమయ్యాయో చెప్పాలన్నారు. జగన్ చేసిన అప్పుల ఫలితంగా అసలు, వడ్డీ కలుపుకొని ఏడాదికి రూ.60 వేల కోట్లు ఎన్‌డీఏ ప్రభుత్వం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లోనూ వికాసం వైపు అడుగులు వేసేలా బడ్జెట్ పెట్టడం అభినందనీయమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చేయూతనిచ్చేలా రైతే రాజు అన్న మాటను నిజం చేసేలా కేటాయింపులు చేశారన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రాజెక్టులన్నీ అటకెక్కాయని, కూటమి వచ్చాకే మళ్లీ అభివృద్ధిని పట్టాలు ఎక్కిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చొరవతో మళ్లీ కేంద్రం నుంచి అమరావతి, పోలవరానికి నిధులు వచ్చాయన్నారు. పోలవరంతో సహా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయబోతున్నామని, తిరిగి దేశంలోనే వ్యవసాయరంగాన్ని నంబర్ -1 చేయాలని సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు.

'మన మిత్ర' వాట్సప్ ద్వారా హాల్ టిక్కెట్లు

గుంటూరు(విద్య),మార్చి4(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు మన మిత్ర వాట్సప్ ద్వారా హాల్‌టిక్కెట్లు పొందవచ్చునని గుంటూరు జిల్లా డీఈవో సివి రేణుక మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు 9552300009 అనే నంబర్‌కు హాయ్ అని మేసేజ్ చేసి లాగిన్ అయ్యి హాల్ టిక్కెట్‌ను డౌన్‌లోడు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ యాజమాన్యం విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం వాట్సప్ ద్వారా హాల్ టిక్కెట్లు తీసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

సాగర్ భూముల కబ్జాపై కదిలిన యంత్రాంగం

● వీపీ సౌత్‌లో ఇరిగేషన్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు
● హద్దులు ఏర్పాటు చేసి అమ్మకాలు జరిపినట్లు నిర్ధారణ
● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కబ్జాకు గురైన భూమిలో ప్లాట్లును పరిశీలిస్తున్న అధికారులు

మాచర్ల టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సాగర్ భూముల కబ్జాపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితం కావడంతో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. మంగళవారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై మాచర్ల మండలం విజయపురిసౌత్ లోని సాగర్ కుడి కాలువ వద్ద గ్లోరీ క్రైస్ట్ చర్చి సమీపంలో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. కబ్జాకు గురైన స్థలంలో కొన్ని ఇళ్లు నిర్మించినట్లు మాచర్ల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. ఇరిగేషన్ శాఖ స్థలంలో హద్దులు ఏర్పాటు చేసి అమ్మకాలు జరిగినట్లు నిర్ధారించారు. మాచర్ల మండలం నాగులవరం గ్రామానికి చెందిన వైసీపీ నేత బూడిద శ్రీను, అనుములపురి రాధ, నాగార్జున సాగర్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు అర్జున్ ఈ భూదందాలో పాలుపంచుకున్నట్లు అధికారులు నిగ్గుతేల్చారు. నకిలీపత్రాలు సృష్టించి భూవిక్రయాలు జరిపి ఉంటారని వెల్లడించారు. కబ్జాదారుల ఇంటికి వెళ్లగా తాళాలువేసి అందుబాటులో లేరన్నారు. కబ్జాదారులపై తదుపరి చర్యలు ఉంటాయని, నివేదికను మాచర్ల తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో విజయపురి సౌత్ సచివాలయం సర్వేయర్ మనోజ్, వీఆర్వో రవికుమార్, ఇరిగేషన్ క్యాంపు గార్డు వెంకటేశ్వర్లు, వీఆర్‌ఏ రవి తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ దామోదర్ నాయుడు

క్రీడలతో నూతనోత్సాహం

● రాష్ట్ర పశుసంవర్థక సంచాలకులు డాక్టర్ దామోదర్‌నాయుడు
● పశు వైద్యుల క్రికెట్ లీగ్ -2025 ప్రారంభం

గుంటూరు సిటీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మునిగిపోతున్న వారికి క్రీడలు నూతనోత్సాహాన్నిస్తాయని రాష్ట్ర పశు సంవర్థక సంచాలకులు డాక్టర్ దామోదర్‌నాయుడు అన్నారు. మంగళవారం నాగార్జున యూనిర్సిటీ రోడ్డులోని డాక్టర్స్ స్పోర్ట్స్ అకాడమీలో రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పశువైద్యుల క్రికెట్‌లీగ్-2025 నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ దామోదర్‌నాయుడు, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి నరసింహారావులు మాట్లాడుతూ ఆట విడుపు కార్యక్రమాలు ఉద్యోగులకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గొర్రెల,మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రజనీకుమారి, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ ఎం వెంకటేశ్వర్లు, సక్కు పౌల్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి వెంకట్ రామ్, స్వస్తిక్ ఫార్మా, వర్షా గ్రూప్ యాజమాన్యం పాల్గొన్నారు. ఈనెల 7వ తేదీ వరకు క్రికెట్ లీగ్ పోటీలు కొనసాగుతాయని డాక్టర్ జయ ప్రకాష్ తెలిపారు.


సర్వేను అడ్డుకున్న వైకుంఠపురం రైతులు

భూ సర్వేను అడ్డుకున్న రైతులు

అమరావతి, మార్చి4(ఆంధ్రజ్యోతి) గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా మంగళవారం వైకుంఠపురంలో పంప్‌హౌస్1 నిర్మాణానికి అవసరమైన భూమికోసం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టగా రైతులు అడ్డుకున్నారు. ల్యాండ్ పూలింగ్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తేనే సర్వేకు ఒప్పుకుంటామని స్పష్టం చేశారు. గతంలో తమ నుంచి తీసుకున్న అభిప్రాయాలపై ప్రభుత్వం స్పందించలేదని, స్పష్టమైన హామీ ఇస్తేనే భూములు ఇస్తామని రైతులు తెలిపారు. రైల్వేలైను, గోదావరి-పెన్నాకాలువ, ఇన్నర్‌రింగ్ రోడ్డు పేరిట తాము అధికంగా భూములు కోల్పోయే పరిస్థితి రానుందని, దీంతో పాటు ఈనాం భూముల సమస్య కూడా అధికంగా ఉందని రైతులు తెలియజేశారు. దీంతో సర్వే సిబ్బంది సర్వే పనులు ప్రారంభించకుండానే వెనుదిరిగి వెళ్లి పోయారు.



రుణ మంజూరు లేఖలను అందజేస్తున్న బిజు వాసుదేవన్

రుణాల మంజూరులో క్రెడిట్ స్కోర్‌కే అధిక ప్రాధాన్యం

గుంటూరుసిటీ, మార్చి4(ఆంధ్రజ్యోతి): రుణాల మంజూరు సమయంలో క్రెడిట్ స్కోర్‌కే అధిక ప్రాధాన్యం ఉంటుందన్న విషయాన్ని గుర్తించుకోవాలని యూనియన్ బ్యాంక్ ముంబై సెంట్రల్ ఆఫీసు చీఫ్ జనరల్ మేనేజర్ బిజు వాసుదేవన్ అన్నారు. మంగళవారం గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో నిర్వహించిన ఎంఎస్ఎంఈ మెగా అవుట్‌రీచ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని యూనియన్ బ్యాంకు ఎంఎస్ఎంఈ పథకాలను వివరించారు. లబ్ధిదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం ముఖ్యమన్నారు. ఎంఎస్ఎంఈ అవుట్ రీచ్ కార్యక్రమం సందర్భంగా రూ.150 కోట్ల విలువైన మంజూరు లేఖలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు రీజియన్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ పోటీలకు

దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే యూత్ పార్ల మెంట్ పోటీల్లో పాల్గొనేందుకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు టీజేపీఎస్ కళాశాల కార్యదర్శి కెవి.బ్రహ్మం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో 18 సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల వయస్సు లోపు వారు ఈ పోటీలలో పాల్గొనవచ్చుని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మైభారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఒక్క నిమిషం నిడివి కలిగిన 'వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ' అనే అంశం పైన వీడియో చేసి ఈనెల 9వ తేది అర్ధరాత్రిలోగా మై భారత్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఇలా వచ్చిన వీడియోల్ని స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం ఐదు జిల్లాల నుంచి ఎంపికైన 150 మంది విద్యార్థులకు జిల్లాస్థాయిలో గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో పోటీ నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాస్థాయి పోటీలో 'వన్ నేషన్, వన్ ఎలక్షన్, పేవింగ్ ది వే ఫర్ వికసిత్ భారత్' అనే అంశంపై 3 నిమిషాలు మాట్లాడాలని తెలిపారు. వివరాల కోసం 9177753393 అనే నంబరుని సంప్రదించాలని సూచించారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. డబ్బులు చెల్లిస్తాను


సెల్ఫీ వీడియోలో అధికారులను వేడుకుంటున్న సచివాలయ ఉద్యోగి లక్ష్మీప్రసాద్

● పెన్షన్ డబ్బులతో పరారైన సచివాలయ ఉద్యోగి
● సెల్ఫీవీడియో సందేశం ద్వారా దాచేపల్లి కమిషనరు, కలెక్టరుకి విజ్ఞాపన
● ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకున్నానని వెల్లడి

దాచేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 'నాకు ఒక్క అవకాశం ఇవ్వండి.. నెల రోజుల్లో డబ్బులు చెల్లిస్తాను. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బు పెట్టి మోస పోయాను. ఒక్క అవకాశం ఇవ్వండి మళ్లీ ఇలాంటి తప్పు జరుగకుండా చూసుకుంటాను' అని పింఛన్ నగదుతో పరారైన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సంపతి లక్ష్మీ ప్రసాదు దాచేపల్లి కమిషనర్, పల్నాడు జిల్లా కలెక్టరుకి విజ్ఞాపన చేస్తూ మంగళవారం సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన రూ.11 లక్షలతో ఈ నెల 1న పరారై ఫోన్ స్విచ్చాఫ్ చేశాడు. ఈ ఘటనపై దాచేపల్లి కమిషనర్ అప్పారావు దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ పరిస్థి తుల్లో వెల్ఫేర్ అసిస్టెంట్ విడుదల చేసిన సెల్ఫీ వీడియో కలకలం రేపింది. ఆ వీడియోలో తానుచేసిన తప్పును ఒప్పుకుంటూ పశ్చాతాపం వ్యక్తం చేశాడు. రెండు రోజులుగా తన భార్య, పిల్లలు ఏమి తినలేదని, ఒకానొక సమయంలో ఆత్మహత్య చేసుకోవటానికి సిద్ధ పడ్డామని ఆవేదన వ్యక్తం చేశాడు. తన తల్లిదండ్రులతో మాట్లాడి డబ్బులు తిరిగి చెల్లిస్తానని ఆ వీడియోలో లక్ష్మీ ప్రసాదు తెలిపాడు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో నిందితుడికి జైలు

నరసరావుపేట లీగల్, మార్చి 4, (ఆంధ్రజ్యోతి), మూడు చోరీ కేసుల్లో నేరం రుజువుకావడంతో నిందితుడు నాదెండ్ల మండలం కనపర్తి గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల బాలయేసుకు ఒక్కొక్క నేరంలో ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి, ప్రధాన జూనియర్ సివిల్ న్యాయాధికారి రెడ్డి ఆశీర్వాదంపాల్ మంగళవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గత ఏడాది నవంబరు 19న పట్టణంలోని జిబిఆర్ వైద్యశాల వద్ద రొంపిచర్ల మండలం బుచ్చి బాపన్నపాలెం గ్రామానికి చెందిన ఓర్సు కృపారావు ద్విచక్ర వాహనం, రామిరెడ్డి పేటలోచెందిన షేక్ మహబూబ్ సుభాని గీత మందిర్ వద్ద కంభంపాటి వెంకట చలమయ్యలకు చెందిన ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్లు మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడు బాలయేసును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో అభియోగ పత్రందాఖలు చేశారు. నిందితుని వద్ద నుంచి మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నేరం రుజువు అవడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువడింది. శిక్ష మొత్తాన్ని ఏకకాలంలో అనుభవించేలా న్యాయాధికారి తీర్పులో పేర్కొన్నారు. కేసును సీఐ ఎంవి.చరన్ ఆధ్వర్యంలో ఎస్ఐ అరుణ దర్యాప్తు చేశారు. కోర్టు కానిస్టేబుల్ పిన్నెబోయిన దుర్గయ్య సాక్షులకు తర్ఫీదు ఇచ్చి కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్‌ను సీనియర్ ఏపీపీ. లక్ష్మీ రాం నాయక్ నిర్వహించారు .

7 నుంచి సాగరమాత ఉత్సవాలు


సాగరమాత, జపమాల స్మారక గుడులు

మాచర్లరూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెంతనే కృష్ణమ్మ పరవళ్లు.. చూడగానే మనస్సుకి ప్రశాంతత చేకూరే ఆలయాలు.. ఎంతో ఆహ్లాదకరమైన ప్రకృతి.. ఇది మాచర్ల మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగరమాత ఆలయ విశిష్టత.. అనునిత్యం ఎంతో మంది ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు.. తమ మొక్కులు చెల్లించుకొని ఆ తల్లి చల్లని దీవెనలు పొందుతారు.. ఈనెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. సాగరమాత పుణ్యక్షేత్రంలో భక్తులు స్నానమాచరించేందుకు పుష్కరఘాట్ ఉంది. తలనీలాలు సమర్పించేందుకు ప్రత్యేక షెడ్డు, రాత్రి వేళ బస చేసేందుకు విశాలమైన ప్రాంగణం ఉంది. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ప్రత్యేక సదుపాయం కలదు. ప్రతి ఆదివారం ఈ ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. తేరు ప్రదిక్షణ గావిస్తారు. ప్రతియేటా మార్చి 7, 8, 9 తేదీల్లో సాగరమాత ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం విశేషం.


ఆలపాటికి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

ఆలపాటి అఖండ విజయం

(5వ పేజీ తరువాయి)

మొత్తం 82320 ఓట్ల ఆధిక్యాన్ని ఆలపాటి సాధించారు. మొత్తం 2,41,774 ఓట్లకు 26909 ఓట్లు చెల్లుబాటు కాలేదు. 2,14,865 ఓట్లు చెల్లుబాటు కాగా అందులో 1,45,057ఓట్లు ఆలపాటికి, 62,737 ఓట్లు లక్ష్మణరావుకు పోలయ్యాయి. పోటీలో నిలిచిన మిగతా 23 మంది అభ్యర్థులకు కలిపి 7071 ఓట్లు వచ్చాయి. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చెల్లుబాటైన ఓట్లలో 50 శాతం కంటే తొలి ప్రాధాన్య ఓట్లలో ఒక ఓటు ఎక్కువ వచ్చిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. ఆ ప్రకారం 1,07,433 ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలుపొందుతారు. ఆలపాటికి కోటా కంటే 37,624 ఓట్లు అధికంగా వచ్చాయి. దాంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపొందినట్లు ప్రకటించి కౌంటింగ్ ప్రక్రియ ముగించారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆలపాటికి డిక్లరేషన్ ఫారంని అందజేశారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఆలపాటి సతీమణి మాధవి, టీడీపీ నేతలు కనపర్తి శ్రీనివాసరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, మద్దిరాల మ్యాని, గవిని సతీష్, వేములపల్లి శ్రీరాంప్రసాదు, వందనదేవి, దాసరిరమణ తదితరులు పాల్గొన్నారు.

తమ్ముళ్ల సంబరాలు..

తొలి రౌండులోనే ఆలపాటి విజయంపై ఆశలు కలగడం.. రౌండు రౌండుకు విజయావకాశాలు బలపడడంతో తెలుగు తమ్ముళ్ల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మొదటి ప్రాధాన్య ఓటులోనే 82,320 ఓట్ల భారీ మెజారిటీ ఆలపాటి విజయ దుందుభి మోగించడం, మంగళవారం తెల్లవారు జామున ఆలపాటి విజయాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించడంతో తెలుగు తమ్ముళ్లు, కూటమి పార్టీల నేతలు, కార్యకర్తల ఆనందం కట్టలు తెంచుకుంది. చిన్న పెద్ద అన్న తేడా లేకుండా నాయకులు, కార్యర్తలు అందరూ కలిసి సంబరాలు చేసుకున్నారు. కౌంటింగ్ కేంద్రం వద్దే ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుని సంతోషాన్ని పంచుకున్నారు. ఆలపాటికి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం ఎదుట టపాసులు, బాణాసంచా పేల్చి తమ ఆనందాన్ని ప్రపంచానికి చాటారు.

నా విజయం.. కూటమి విజయం : ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

గుంటూరు(తూర్పు): అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమంతోనే తన గెలుపు సాధ్యమైందని శాసనమండలికి కృష్ణా-గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్ర సభ్యుడిగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో డిక్లరేషన్ అందుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విజయం ఒక చరిత్ర అని, మంత్రి పదవిపై ఆలోచన లేదని తెలిపారు. శాసనమండలిలో గళం విప్పి, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను నమ్మిన ఓటర్లు 83 వేల మెజార్టీ ఇచ్చారని ఆనందం వ్యక్తం చేశారు. తనపై అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేసిన ప్రత్యర్థులకు ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌న్నారు.

విద్యా విధానాన్ని వైసీపీ సర్వనాశనం చేసిందని, దానిని గాడిలో పెట్టేందుకు నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో ఉపాధ్యాయులుకు సామాజిక గౌరవం ఇవ్వలేదని, చివరకి విశ్వవిద్యాలయాల్లో కూడా రాజకీయాలు చేసి కలుషితం చేశారన్నారు. యూనివర్సిటీలు రాజకీయాలకు నిలయాలుగా మారిన పరిస్థితుల్లో మార్పు తీసుకొస్తుంటే విమర్శలు చేస్తున్నారన్నారు. తాము యూనివర్సిటీలను ప్రత్యేక గురుకులాలుగా భావించామన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200.00
చికెన్ స్కిన్ లెస్	210.00

కూటమి ప్రభుత్వంతోనే నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి

పెదకూరపాడు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే నాయీ బ్రాహ్మణుల అభ్యున్నతి అని నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో సెలూన్ షాపులకు రెండొందల యూనిట్లు ఉచిత విద్యుత్ ప్రకటించటం, దీనికి రూ.450 కోట్లు కేటాయించారన్నారు. వెయ్యి కోట్ల బడ్జెట్‌లో ఆదరణ పథకం ద్వారా నాయీ బ్రాహ్మణులకు వృత్తిపరమైన పనిముట్లను అందిస్తామన్నారు. దేవాల య ట్రస్ట్ బోర్డులో వారిని సభ్యులుగా నియమించడం హర్షించ దగ్గ విషయం అన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

సర్పంచ్‌పై టీడీపీ నాయకుల ఫిర్యాదు

ముప్పాళ్ళ మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంకెలకూరపాడు గ్రామ సర్పంచ్ మోర్తల వెంకటరెడ్డి స్థానికంగా నివాసం ఉండకుండా హైదరాబాదులో ఉంటాడనీ 5 నెలలకు ఒకసారి వస్తూ అభివృద్ధి పనులకు తీర్మానాలివ్వకుండా అడ్డుకుంటున్నాడని గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మంగళవారం ఈవోపీఆర్డీ రూపవతికి ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలో పనిచేసే వర్కర్లకు జీతాలను కూడా ఇవ్వడంలేదని ఫిర్యాదు చేశారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.3లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను తొలగించాడని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచినీటి చెరువు చుట్టూ రూ.10లక్షలతో నిర్మించిన ఫెన్సింగ్‌ను తొలగించి ఇష్టారాజ్యంగా వ్యవహరించాడని, సర్పంచ్ అక్రమాలపై విచారణచేసి గ్రామాభివృద్ధి చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో క్రిస్టిపాటి సుబ్బారెడ్డి, క్రిస్టిపాటి రవింద్రారెడ్డి, మలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, యర్రం అప్పిరెడ్డి, మస్తాన్‌రెడ్డి, ఎం వెంకటరెడ్డిలు ఉన్నారు.

ప్రతినెల అద్దె చెల్లించండి

● జడ్పీ కాంప్లెక్స్‌ను పరిశీలించిన డిప్యూటీ సీఈవో

పిడుగురాళ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జడ్పీ కాంప్లెక్స్ గదుల లీజుదారులు ప్రతినెల అద్దెను క్రమం తప్పకుండా చెల్లించాల్సి ఉందని గుంటూరు జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ అన్నారు. మంగళవారం పిడుగురాళ్ల జడ్పీ కాంప్లెక్స్ గదులను పరిశీలించడంతోపాటు మండల పరిషత్ కార్యాలయంలో లీజుదారులతో సమావేశమై అద్దెను క్రమం తప్పకుండా ప్రతినెల చెల్లించాలని, అద్దెను బకాయిలుగా పెంచవద్దని.. అలా పెంచితే గదులను ఖాళీ చేయించాల్సి వస్తుందన్నారు. పిడుగురాళ్ల హైస్కూల్ సమీపంలో ఉన్న 13 గదులకు సంబంధించి రూ.31 లక్షల 79 వేల బకాయిలకు గాను మంగళవారం రూ.2లక్షల 10 వేలు వసూలు చేశారని తెలిపారు.

పాముకాటుతో వలస కూలీ కుమారుడు మృతి



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనుల నిమిత్తం వలస కూలీలు గా వచ్చిన ఓ కుటుంబంలో పాముకాటుకు గురై పెద్దకుమారుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే ఏలూరు జిల్లా కైకలూరు మండలం శృంగవరపుపాడుకు చెందిన జయమంగల నాగరాజు భార్య ఇద్దరు కుమా రులతో కలసి మండలపరిధిలోని దిడుగు గ్రామంలో వ్యవసాయ పనులకు నాలుగు రోజుల క్రితం వచ్చారు. సోమవారం తెల్ల వారు జామున గ్రామశివారులో ఏర్పాటు చేసుకున్న పాకాలో కుటుంబం నిద్రిస్తుండగా పెద్దకుమారుడైన శ్రీనివాస రావు(12) చేతిపై పాము కాటువేసింది. అమరావతిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రాథమి క చికిత్స అనంతరం గుంటూరు జీజీహెచ్ కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పొట్టకూటి కోసం వస్తే కన్నకొడుకును కోల్పోవాల్సి వచ్చిందని కుటుంబసభ్యులు దుఃఖిస్తున్నారు.

ఇరువర్గాలపై కేసులు నమోదు

మాచర్ల రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఇరువర్గాలపై రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కొండా శివలింగం, కామనబోయిన చంద్రయ్యల పాతకక్షలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సోమవారం రాత్రి వారిద్దరి మధ్య మాటామాటా పెరిగి ఇరువర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గురజాల డీఎస్పీ జగదీష్, మాచర్ల పట్టణ సీఐ ప్రభాకరరావులు గ్రామానికి చేరుకొని ఇరువర్గాలకు సర్దిచెప్పి శాంతింపజేశారు. శివలింగం, చంద్రయ్యల ఫిర్యాదు మేరకు ఒక్కో వర్గంలోని పది మంది చొప్పున 20 మందిపై మాచర్ల రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు

పిడుగురాళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా వారోత్సవ కార్యక్రమం జరిగింది. జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ధనలక్ష్మీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ వున్నం భారతి, ఆయుష్ వైద్యాధికారి మేఘమాలలు పాల్గొని మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళల ప్రాధాన్యం, మహిళా సాధికారత గొప్పతనాన్ని వివరించారు. అనంతరం పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 30.89 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామన్నారు.

జగనన్న కాలనీల్లో బినామీలు

● పేదల స్థలాలు కాజేసిన వైసీపీ నేతలు
● అధికారం అండతో అడ్డగోలుగా ఆక్రమణలు
● అధికారుల భాగస్వామ్యంపై అనుమానాలు ?
● గుట్టు రట్టవడంతో అధికారుల్లో ఆందోళన
● తీగ లాగితే.. డొంక కదులుతుంది



పులిపాడులోని జగనన్న కాలనీ

కంచె చేను మేసిన మాదిరి గత ప్రభుత్వ పాలనలో పాలకులే పేదల స్థలాలపై కన్నేశారు. పభుత్వం మంజూరు చేసిన స్థలాలను అర్హులైన పేదలకు అందించాల్సింది పోయి బినామీల పేరిట కాజేసి సొమ్ము చేసుకున్నారు. ఎలాగోలా అధికారులను ఒప్పించి 'తిలా పాపం తలా పిడికెడు' అన్న చందానా జేబులు నింపుకున్నారు. పేదల స్థలాలే కదా కాజేసినా అడిగేదెవరులే అని నకిలీ పత్రాలు సృష్టించుకొని పంచాయతీలో ప్రథమ పౌరుడు మొదలు పట్టణంలో కౌన్సిలర్ల వరకు అందిన కాడికి దోచేశారు.

గురజాలటౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గురజాల మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా భూఆక్రమణలకు తెగబడ్డారు. ఆ ప్రభుత్వం పేదలకు అందించిన స్థలాలనూ వదల్లేదు. మండలంలోని పులిపాడులో 2021 సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరిట గ్రామంలోని సచివాలయం సమీపంలో 446 మందికి, ఎస్సీ కాలనీ వద్ద 174 మంది పేదలకు ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున నివేసనా స్థలాలను మంజూరు చేసి పట్టాలను పంపిణీ చేసింది. అయితే గ్రామంలోని కొందరు ఆక్రమణదారులు 10 ప్లాట్ల దాకా కాజేశారు. పక్కనే ఉన్న వేరే సర్వే నంబర్లతో తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఇందుకు అధికారులు కూడా సహకరించినట్లు ఆరోపణలూ ఉన్నాయి. అయితే ఈ గుట్టు అంతా బయటకు పొక్కి రెవెన్యూ కార్యాలయం వరకూ చేరింది.

అడ్డగోలుగా అగ్రిమెంట్లతో..

గురజాల పట్టణ పరిధిలో హైవే పక్కన, పట్టణ



గురజాల పట్టణంలోని జగనన్న కాలనీ

శివారులోని జంగమహేశ్వరపురం వద్ద జగనన్న కాలనీలు మంజూరయ్యాయి. ఈ రెండు చోట్ల కలిపి 1371 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీటిల్లో 875 గృహాలు పూర్తయ్యాయి. రూ.85 లక్షలతో విద్యుత్ లైన్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే కొందరు పేదలు గృహాలు నిర్మించుకునే స్తోమత లేక బేస్‌మెంట్లు స్థాయిలోనే నిర్మాణాలు నిలిపివేయగా మరికొందరు అసలు నిర్మాణాలను ప్రారంభించనేలేదు. ఇది అదునుగా బావించిన వైసీపీ నేతలు అడ్డగోలుగా అగ్రిమెంట్లు పుట్టించి అమ్ముకుంటున్నారు. వీరిలో కౌన్సిలర్లు కూడా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక్కొక్కరు నాలుగైదు సెంట్లు చొప్పున కాజేసినట్లు తెలుస్తోంది. ఈ తతంగమంతా అసెంబ్లీ ఎన్నికలకు నాలుగైదు నెలల ముందు జరిగింది.

ఇసుకనూ వదల్లేదు..

జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల కోసం వచ్చిన ఇసుకనూ ఈ భూబకాసురులు వదల్లేదు. కాలనీల్లో డంపు అయిన ఇసుకనూ టిప్పర్ల కొద్దీ కాజేసి అమ్ముకున్నారు. పట్టణంలోని జగనన్న కాలనీలో ఓ ప్రజాప్రతినిధి ఇసుకను మాయం చేశాడంటూ పలు పత్రికల్లో (ఆంధ్రజ్యోతిలో కూడా) కథనం వెలువడింది. అధికారులు హడావిడిగా చర్యలు తీసుకుంటున్నాం అని ప్రకటించారే గానీ రికవరీ మాత్రం చేయనేలేదు. చాలా చోట్ల జగనన్న కాలనీల్లో వైసీపీ నేతలు ఇసుకను కాజేశారనే ఆరోపణలూ ఉన్నాయి.

ఇలా చెప్పుకుంటూ పోతే మండలంలోని ప్రతి గ్రామంలోని జగనన్న కాలనీల్లో వైసీపీ నేతల భూబాగోతం కోకొల్లలుగా ఉన్నాయి. వైసీపీ నేతలు అవినీతితో సంపాదించిన ప్రతి పైసా కక్కిస్తాం.. అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టం అని చెప్పిన కూటమి నేతలు జగనన్న కాలనీల్లో భూదందాలపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు. వైసీపీ నేతల భూబాగోతం ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవశ్యకత ఉంది.

మా దృష్టికి వచ్చింది.. విచారణ జరిపిస్తాం

- తహసీల్దార్ నగేష్



మండలంలోని పులిపాడులో అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం మా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ జరిపి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు.

ఆలపాటి గెలుపుపై కూటమి నేతల్లో ఆనందం



పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నిఖిల్, కూటమి శ్రేణులు



ఆలపాటికి పుష్పగుచ్ఛం అందిస్తున్న యాగంటి

పిడుగురాళ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ పిడుగురాళ్ల పట్టణ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే యరపతినేని తనయుడు నిఖిల్, కూటమి శ్రేణులు విజయోత్సవ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పాండురంగ శ్రీను, షేక్ బాబావలి, కనిగిరి శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, గండికోట వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌అలి, తురకా వీరస్వామి, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, పణితి రవి, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, మేకల రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని కలిసిన యాగంటి

మాచర్లటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను మంగళవారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు కలిశారు. ఆలపాటికి అభినందనలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందించారు. యాగంటి వెంట వంగవరపు కోటేశ్వరరావు, కొండలు, ప్రసాద్, బ్రహ్మం, కోటేశ్వరరావు, ఆంజనేయులు, వేముల దుర్గారావు, వీరేశ్వరరావు, వీరయ్య చందు, మస్తాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

● **కారంపూడి (ఆంధ్రజ్యోతి):** ఆలపాటి గెలుపుపై మంగళవారం స్థానిక కూటమి నేతలు ఆనందం వ్యక్తం చేశారు. స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, బీజేపీ రాష్ట్ర నేత శెట్టి హనుమంతురావు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బూసా రామాంజినేయులు, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్, చప్పిడి రాము తదితరులు పాల్గొన్నారు.

● **సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి)** : రాష్ట్రంలో జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మిత్ర పక్ష కూటమి ఘన విజయం సాధించటంపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయానికి కృషి చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అభినందనలు తెలిపారు. టీడీపీ పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి దివ్వెల శ్రీనివాసరావు కూడా కూటమి అభ్యర్థి విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

● **రాజుపాలెం (ఆంధ్రజ్యోతి):** రాజుపాలెంలో కూటమి నేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించటం అభినందనీయమన్నారు. సమావేశంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు తోట నరసయ్య, గంగవరపు రామలక్ష్మణరావు, అంకాళ్ల ప్రభుదాను, జెట్టి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

● **క్రోసూరు (ఆంధ్రజ్యోతి)** : ఆలపాటి రాజా గెలుపుపై నియోజకవర్గ టీడీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు కాంధ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దుద్దుల యోహాన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

● **బెల్లంకొండ (ఆంధ్రజ్యోతి)** : ఆలపాటి విజయంపై కూటమి అభ్యర్థి, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు అక్కల వెంకట రామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, గుడిసె కొండయ్య, ఓర్సు ఆనంద్, హను మంతరావు నాయక్, సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ జానీ, నాగమణి బాయి, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణకు మందు పంపిణీ

మాచవరం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రబీ సీజన్‌లో వరి వేసిన రైతులకు సామూహిక ఎలుకల నివారణ కోసం మందు ఉచితంగా పంపిణీ చేశారు. మంగళవారం మండలంలోని కొత్తగణేషునిపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా కేంద్రంలో ఎలుకల నివారణ కోసం మందు ఎలా తయారు చేసుకోవాలి? విధానాన్ని రైతులకు చూపించి ఉచితంగా మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవో రామమ్మ, వ్యవసాయ సహాయకులు సతీష్, సర్పంచ్ పల్లా నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

● **గురజాలటౌన్ (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మాడుగుల, చర్లగుడిపాడు, జంగమహేశ్వరపురం, పల్లెగుంత గ్రామాల్లో నిర్వహించిన సామూహిక



కొత్తగణేషునిపాడులో ఎలుకల నివారణకు మందు కలుపుతున్న ఏవో రామమ్మ తదితరులు

ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో ఏవో సంధ్యారాణి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.

● **మాచర్ల రూరల్ (ఆంధ్రజ్యోతి):** మండలంలోని తాళ్లపల్లిలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు ఎలుకల నిర్మూలన మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంగమహేశ్వరపురం శాస్త్రవేత్త డాక్టర్ సైదానాయక్, ఏవో లక్ష్మారెడ్డి, ఉద్యాన అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● **ముప్పాళ్ళ (ఆంధ్రజ్యోతి):** మండలంలోని అన్నిగ్రామాల్లో సామూహిక ఎలుకల నివారణకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు మందును పంపిణీ చేసినట్లు ఏవో అరుణ తెలిపారు.

● **బెల్లంకొండ (ఆంధ్రజ్యోతి)** : బెల్లంకొండ మండలంలోని వరి సాగు చేస్తున్న కందిపాడు, చంద్రాజుపాలెం గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఏవో కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం






పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణిస్తున్న గ్రామీణ ప్రాంత ప్రజలు

కారంపూడి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అధికంగా ప్రయాణికులను ఎక్కించుకొని వాహనదారులు ఈ ప్రాంతంలో సంపాదనకే ప్రాధాన్యమిస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా వాహన చోదకుల్లో ఎటువంటి మార్పు కనపడలేదు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రధానంగా కారంపూడి, వినుకొండ, ఈపూరు, బొల్లాపల్లి మండలాల గ్రామీణ ప్రజలు ఆటోలకే ప్రాధాన్యమిస్తున్నారు. త్వరగా గమ్యాన్ని చేరుకోవాలని ప్రాణాంతక ప్రయాణాన్ని ఎంచుకుంటున్నారు. ప్రాణాలను పణంగా పెడుతున్నారు.

దివ్యాంగులకు ఉచితంగా జైపూర్ కృత్రిమ అవయవాలు

అచ్చంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచితంగా ఈనెల 7, 8, 9 తేదీల్లో విజయవాడలో జరిగే కార్యక్రమాల్లో జయపూర్ కృత్రిమ అవయాలు ఉచితంగా అందిస్తున్నామని సామాజిక కార్యకర్త కమల్ సైదా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ద చేంజ్ మేకర్ సంస్థ, ఆర్‌కే ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ క్యాంపులో సుమారు పది లక్షల రూపాయలతో నిర్వహిస్తున్నామని, మూడు రోజుల పాటు విజయవాడలోని సీవీ రెడ్డి హాల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నాలుగు వందల మందికి కృత్రిమ అవయవాలు ఉచితంగా అందిస్తామన్నారు. సెల్ నెంబరు 7013831026 ద్వారా వివరాలు తెలుసుకోవాలన్నారు.

నాటు సారాపై తండాల్లో అవగాహన



సండ్ర తండాలో ప్రజలకు సారాపై అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అచ్చంపేట, క్రోసూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు సారా తాగడం వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడువాయి పంచాయతీ పరిధిలోని సండ్ర తండా, బంగారు తండాల్లోని ప్రజలకు సారా తాగడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. క్రోసూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా తండాల్లోని అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. పాత ముద్దాయిలపై బైండోవర్ చేస్తామని, సారా అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సారా కాచే ప్రదేశాల్లో దాడులు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సూర్యనారా యణ, క్రోసూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసీ, ఎస్‌ఐలు శ్రీనివాస్, రెహ్మాన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 527.10 అడుగులు ఉంది. ఇది 162.54 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8807 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,910 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 5584 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలి

● సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ సుబ్బారావు

క్రోసూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకొని పట్టుదలతో వాటిని చేరుకోవటానికి కృషి చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వరద సుబ్బారావు అన్నారు. మంగళవారం క్రోసూరు కస్తూర్భా గాంధీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పరీక్షల కోసం ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని, ప్రత్యేకమైన ప్రణాళికను ఏర్పాటు చేసుకొని వందశాతం లక్ష్యాలు చేరుకొనే విధంగా పరీక్షలు రాయాలన్నారు. పాఠశాల ఆవరణను, తరగతి గదులను పరిశీలించారు. నాడు - నేడు పనులు నిలిచి పోవటంపై ఆయన అధికారులతో మాట్లాడతానని తెలిపారు. సాధ్యమైనంత త్వరలో అదనపు తరగతి గదులను నిర్మాణం పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

● ఈవోపీఆర్డీ వెంగళరావు

మాచవరం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరు నాటికి అన్ని గ్రామ పంచాయతీల్లో నూటికి నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఈవోపీఆర్డీ వెంగళరావు అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో పలు గ్రామాల్లో నీటి ఎద్దడి వచ్చే అవకాశాలు ఉన్నాయని, దానికి గాను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సర్పంచులతో సమన్వయం ఏర్పాటు చేసుకొని నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి రోజు ఇంటింటికి తిరిగి పొడి, తడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. సమావేశంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

పారా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్ శ్యామ్‌కు సన్మానం

దుర్గి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పారా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌గా జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన దుర్గికి చెందిన ఇంజమూరి శ్యామ్‌ను ఎమ్మార్పీఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. గత నెల 18వ తేదీన చెన్నైలో జరిగిన 23వ పారా నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలో పురుషుల టి-44 కేటగిరి హైజంప్‌లో శ్యామ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ మేరకు మంగళవారం దుర్గిలోని ఏఈఎల్‌సీ చర్చిలో ఎమ్మార్పీఎస్ నేతలు దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కందుకూరి రమేష్, గడ్డిపర్తి శ్రీనివాసరావు, సంజయ్, మాణిక్యరావు, అక్కులు, సాగర్, రమేష్, అమర్, బాబురావు, బుజ్జిబాబు, అనిల్, జీవన్, చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జెన్‌కో ఆధ్వర్యాన జాతీయ భద్రతా వారోత్సవాలు



జాతీయ భద్రతా వారోత్సవాల్లో ఏపీ జెన్‌కో ఉద్యోగులు

మాచర్ల రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో నాగార్జున సాగర్ కుడి జల విద్యుత్ కేంద్రం ఉద్యోగులు మంగళవారం జాతీయ భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈఈ సీహెచ్ అప్పాజీ మాట్లాడుతూ ప్రమాదాలన నివారించడానికి భద్రతను అనుసరించాలన్నారు. భద్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీరో ప్రమాదాలతో ఉత్పత్తులను చేపడదాం

దాచేపల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీరో ప్రమాదాలతో ఉత్పత్తులను చేపట్టాలని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ ప్లాంట్ హెడ్ సుబ్బారావు కార్మికులను కోరారు. మంగళవారం దాచేపల్లి మండలం గామాలపాడు శివారులోని ఆంధ్రా సిమెంట్ లిమిటెడ్ దుర్గాపురం నందు 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రారంభించారు. భద్రతా వారోత్సవాలు సేఫ్టీ మేనేజర్ సంజయ్‌సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు నరేంద్రరెడ్డి, నాగభూషణం, అంబేద్కర్‌రెడ్డి, సూర్య ప్రకాష్, గణేష్, నరసింహులు, వేణు, తారక్, అవినాష్, కార్మికులు, విద్యార్థులు, సేఫ్టీ టీమ్ పాల్గొన్నారు.

నేడు 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు

రెంటచింతల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో నేడు 54వ జాతీయ భద్రత వారోత్సవాలను నిర్వ హించనున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావుతో పాటు ఇన్‌స్పెక్టర్లు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

16న రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసింహారావు తదితరులు

నరసరావుపేట టౌన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో స్వాతంత్ర్య సమరయోదుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహా ఆవిష్కరణ ఈ నెల 16న జరుగుతుందని టీడీపీ వడ్డేర సాధికార సమితి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలకొండ నరసింహారావు మంగళవారం తెలిపారు. విగ్రహావిష్కరణకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలో ఉన్న ఎంపీ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఎంపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమర దుర్గారావు, విగ్రహ కమిటీ అధ్యక్షుడు కొమెర అనంత రాములు, చెల్లా పిచ్చెయ్య, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, కనిగిరి బాలు, కుంచాల శ్రీనివాసరావు, తిరుమలకొండ గురవయ్య తదితరులు పాల్గొన్నారు,

రాష్ట్ర స్థాయి శిక్షణకు నందిగామ సర్పంచ్

సత్తెనపల్లి రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి ఈనెల 8వ తేదీ న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాపట్లలోని ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి శిక్షణకు ఎంపికైనట్టు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ(ఉమెన్ ఫ్రెండ్లీ) గ్రామ పంచాయతీలు అనే అంశంపై 5, 6 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయిలో శిక్షణలో సర్పంచ్‌తో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శి చిలువూరి కృష్ణ ప్రసాదులు పాల్గొంటారన్నారు. పల్నాడు జిల్లా నుంచి సత్తెనపల్లి మండలం తరఫున ఎంపికైన సర్పంచ్ రమాదేవి అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో జిల్లా నుంచి ఎంపికైన 26 మోడల్ ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు శిక్షణలో పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు. శిక్షణకు ఎంపికైన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో, ఈవోపీఆర్డీ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు.



హిందువుల దహనవాటిక



తుళ్లూరు సమీపంలోని శాఖమూరు రోడ్డు వెంబడి ఏర్పాటవుతున్న స్మార్ట్ అంత్యక్రియలకేంద్రం



డీప్ ఏసీ ఫ్రీజర్ రూమ్

సర్వమత.. స్వర్గధామం!

- ❖ హిందూ, ముస్లిం, క్రైస్తవుల స్మార్ట్ ఐక్య అంత్యక్రియల కేంద్రం
- ❖ ఆధునిక వసతులు.. సకల సౌకర్యాలు
- ❖ తుళ్లూరు సమీపంలోని శాఖమూరు రోడ్డులో ఏర్పాటు
- ❖ నూతన సంస్కరణలకు తెరటీసిన సీఆర్‌డీఏ

దేశంలో అన్ని మతాల వారికి కలిపి ఒకేచోట మహాప్రస్థానాన్ని ఆధునిక సౌకర్యాలతో సర్వాంగసుందరంగా నిర్మిస్తున్న ఘనతను నవ్యాంధ్ర రాజధాని అమరావతి నగరం దక్కించుకుంది. మరణానంతరం ఒకే మరు భూమి నుంచి కానరాని లోకాలకు వెళ్లే ఓ సరికొత్త శకానికి అమరావతి శ్రీకారం చుట్టింది. ఏపీ సీఆర్‌డీఏ అధికారులు నవ్యరాజధాని అమరావతిలో ఈ సరికొత్త ప్రయోగానికి తెరదీశారు. మరో నెల రోజుల వ్యవధిలో పూర్తికానున్న ఈ స్మార్ట్ అంత్యక్రియల కేంద్రం వినియోగంలోకి వచ్చాక... వెల్లడయ్యే ఫలితాలను బట్టి రాజధాని అమరావతి ఏరియాలో మరో నాలుగు కేంద్రాలను ఇదే తరహాలో ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. దేశంలో తొలిసారిగా చేపట్టిన ఈ స్మార్ట్ ఐక్య అంత్యక్రియల కేంద్రాన్ని తుళ్లూరు నుంచి గుంటూరు వచ్చే రోడ్డుమార్గానికి చేరువగా శాఖమూరు రోడ్డు వెంబడి ఎనిమిదెకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

సమాజంలో సుదీర్ఘకాలం పాటు శ్మశానాలపై ఓ రకమైన ఏదో తెలియని ఏహ్యాభావం పాతుకుపోయి ఉంది. కాలగతిలో విజ్ఞాన వికాసాలు గుభాళిస్తూ వచ్చిన నేపథ్యంలో శ్మశానాల పట్ల ఉన్న భావాలు పూర్తిగా మారుతూ వచ్చాయి. శ్మశానమంటే ప్రతి మనిషికి శాశ్వత నివాస స్థానమన్న కొత్త ఒరవడి వచ్చింది. అందుకే శ్మశానాల అసహ్యకర వాతావరణ పరిస్థితుల నుంచి బయటపడి సుందరమైన నందనవనాల మాదిరి ఉండాలన్న ఆకాంక్ష సమాజంలో క్రమంగా మొదలైంది. మన రాష్ట్రం వరకు చూస్తే ఈ సరికొత్త విప్లవాత్మకమైన ఆలోచనలకు తొలుత రాజమండ్రి నగరం శ్రీకారం చుట్టింది. ఇక అక్కడి నుంచి అది క్రమేపీ అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తూ ప్రస్తుతం అద్భుతమైన, అమోఘమైన, ఆశ్చర్యకరమైన సంస్కరణలకు దారితీసింది.

స్మార్ట్ సిటీ నిధులతో..

రాజధాని అమరావతి నగరం రాబోయే రోజుల్లో ఎన్నో ప్రత్యేకతలకు నిలయంగా మారనుంది. అందులో ఇది కూడ ఓ ప్రత్యేకమైందే. 2015-16లో కేంద్రం ప్రారంభించిన స్మార్ట్ సిటీ మిషన్ పథకం కింద రాష్ట్రంలోని విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతి నగరాలు మూడు దశలుగా ఎంపికయ్యాయి. వాటిలో మూడో దశ కింద 2017లో ఎంపికైన అమరావతికి సుమారు రూ.120 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులు 2019 తరువాత విడుదలై ముగిసిపోతున్న దశలో సీఆర్‌డీఏ అధికారులు రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాలలో శ్మశాన భూముల సమస్యను పరిష్కరించే విధంగా వినియోగించాలని నిర్ణయించారు. దీనినే కొంచెం వినూత్నంగా ఆలోచించి స్మార్ట్ ఐక్య అంత్యక్రియల కేంద్రాల ఏర్పాటుకు పథకం రచన చేశారు. అందులో భాగంగానే తొలుత తుళ్లూరు సమీపంలోని శాఖమూరు రోడ్డులో సుమారు ఎనిమిదెకరాల విస్తీర్ణంలో రూ.9.48 కోట్ల వ్యయంతో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల వారిని కలిపి ఒకే ఐక్య స్మార్ట్ అంత్యక్రియల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిర్మాణ పనులు దాదాపు తుదిదశకు వచ్చేశాయి. మరో నెలరోజుల్లో ప్రారంభానికి సిద్ధం కానుంది.

దక్షిణ భాగం హిందువుల కోసం..

శాఖమూరు రోడ్డులో ఎన్-14, ఈ-8 జంక్షన్ వద్ద ఇది రూపుదిద్దుకుంటుంది. ముఖద్వారాన్ని దాటి ముందుకు వెళ్లగానే కుడి పక్క, ఎడమ పక్క ఒకే తరహాలో ఉండే రెండు భవనాలను నిర్మించారు. కుడిపక్క భవనాన్ని పరిపాలనా భవనంగా, ఎడమపక్క భవనాన్ని భోజనాల నిమిత్తం వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేశారు. లోపలిపక్క మొత్తం స్థలానికి మధ్య ప్రాంతాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా విభజించి దక్షిణ భాగం మొత్తాన్ని హిందూ శ్మశాన వాటికగా వేరు చేశారు. ఇందులో ఓ వైపు దహన వాటిక (కట్టెలతో కాల్చేందుకు) తో పాటు బంధుమిత్రులు కూర్చొని వీక్షించేందుకు వీలుగా రెండు కాంక్రీట్ షెల్టర్‌లను ఏర్పాటు చేశారు. దీనికి ముందు వైపు ఎలక్ట్రిక్ మిషన్‌తో దహనం చేసేవిధంగా మరో స్థలిని, దాని కెదురుగా ఖననం చేసేందుకు కొంత జాగాతో కూడిన ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. వీటికి చేరువలోనే పిండ ప్రధానస్థలిని ఆధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నారు. ఇదంతా మొత్తం ప్రాంగణంలో దక్షిణంగా ఏర్పాటవుతోంది.



భోజనశాల భవనం

ఉత్తరంగా కబరస్తాన్... బరియల్ గ్రౌండు

ఉత్తరదిశలో క్రైస్తవ, ముస్లింల శ్మశాన వాటికలను వారివారి సంప్రదాయాలకు అనుగుణంగా వేర్వేరుగా నిర్మించారు. ఈ మూడు రకాల శ్మశాన వాటికలకు సమీపంలోనే టాయ్‌లెట్స్‌తో కూడిన స్నానాల గదులను మూడు వేర్వేరు భవనాలుగా ఏర్పాటు చేశారు. ఈ మొత్తం శ్మశానస్థలికి పూర్తిగా పశ్చిమంగా ఉన్న మొత్తం ప్రాంతాన్ని గ్రీనరీకి కేటాయించారు. శ్మశాన స్థలిలో 30 శాతానికి పైగా స్థలాన్ని గ్రీనరీకే కేటాయించారు. ప్రస్తుతానికి ఈ గ్రీనరీ పనులు ఇంకా మొదలు కాలేదు. అంత్యక్రియల సందర్భంగా వినియోగించే వస్తువుల కోసం బయట మార్కెట్‌కు వెళ్లకుండా ఇక్కడే అన్ని మతాలవారికి వారివారి సంప్రదాయాలను అనుసరించి వాడే వస్తు, పదార్థాలన్నింటిని అందుబాటులో ఉంచారు. ఇందుకోసం కొన్ని అంగళ్లను ఇందులోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. విదేశాలు లేదా దూర ప్రాంతాల నుంచి బంధువులు చివరి చూపు కోసం రావడం ఆలస్యమైతే ఆ మృతదేహం పాడవకుండా కొన్ని రోజుల పాటు భద్రంగా ఉంచేందుకుగానూ ఈ ప్రాంగణంలోనే ఓ డీప్ ఏసీ ఫ్రీజర్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఎటువైపు వెళ్లాలన్నా అన్నీ సిమెంటు రోడ్లు, పార్కింగ్ టైల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇన్ని సౌకర్యాలు, వసతులతో ఆహ్లాదకరంగా ఉండేలా ఈ స్మార్ట్ అంత్యక్రియల కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. కేంద్రం నిర్వహణకు అవసరమయ్యే విద్యుత్ కోసం సౌరవిద్యుత్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు.

త్వరలో మందడం, నవులూరులోనూ..

రాజధాని అమరావతిలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ స్మార్ట్ అంత్యక్రియల కేంద్రం ప్రారంభోత్సవం తరువాత ఆశించిన ఉత్తమ ఫలితాలను ఇస్తే దానిని రాజధాని ప్రాంతంలోని మిగిలిన గ్రామాలకు కూడ విస్తరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. ప్రస్తుతానికి ఈ కేంద్రాన్ని తుళ్లూరు, దొండపాడు, అబ్బురాజుపాలెం, శాఖమూరు, నేలపాడు గ్రామాల వారు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ తరువాత రెండో దశలో మందడం, నవులూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సీఆర్‌డీఏ ప్రతిపాదించింది. మూడో దశలో మిగిలిన గ్రామాలకు మరో రెండు వేర్వేరు ప్రాంతాలలో ఏర్పాటు చేసే విధంగా సీఆర్‌డీఏ ప్రణాళికను రూపొందించుకుంది.

ప్రభువు ప్రేరణతోనే గుడారాల పండుగ

హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహాం

రేపటి నుంచి గుడారాల పండుగ



సమావేశంలో మాట్లాడుతున్న అబ్రహాం, చిత్రంలో జాన్‌వెస్లీ, అనిల్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి) ఏసు ప్రభువు ప్రేరణతోనే 48వ హోసన్నా గుడారాల పండుగ అమరావతి మండలం లేమల్లె గ్రామంలోని హోసన్నా దయాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం తెలిపారు. మంగళవారం దయాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ అనిల్‌తో కలసి మాట్లాడారు. హోసన్నా మినిస్ట్రీస్ 1977సంవత్సరంలో హోసన్న నెల్లూరు నుంచి వచ్చి లేమల్లె గ్రామంలో సేవ ప్రారంభించారని అన్నారు. 47సంవత్సరాల పాటు జరిగిన గుడారాల పండుగలో వివిధ శాఖల అధికారులు, పత్రికా మిత్రులు, ప్రజాప్రతినిదులు, హోసన్నా మినిస్ట్రీస్ సేవకులు అందించిన సహకారంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 6నుంచి 9వ తేదీవరకు నిర్వహించే 48వ గుడారాల పండుగను మరింతగా విజయవంతం చేసేందుకు 140ఎకరాలలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ, రైల్వే శాఖలు కూడా ఈ పండుగకు పూర్తి సహకారం అందించి విశ్వాసులకు మెరుగైన రవాణా ఏర్పాట్లు చేస్తున్నాయన్నారు. పండుగకు 20లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. పండుగకు హాజరయ్యేవారికి తాగునీరు, చలువ పందిళ్లు, స్ర్కీన్‌లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీనియర్ పాస్టర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దేశ విదేశాల నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరవుతారన్నారు. 5వ తేదీ సాయంత్రం మందిరాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. పండుగ ముగింపు రోజు దయా క్షేత్రం నుండి నేరుగా ప్రముఖ పట్టణాలకు విశ్వాసులను గమ్యాలకు చేర్చేందుకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల నడుపుతుందన్నారు. రైల్వే కూడా పది కోచ్‌లను ఏర్పాటు చేస్తుందన్నారు.

చక్కెరకేళి.. భళా

- ● కాసులు కురిపిస్తున్న గెలలు
- ● ఆనందంలో అరటి రైతులు



కొల్లిపర, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అతిపెద్ద అరటి మార్కెట్‌గా ప్రసిద్ధిచెందిన కొల్లిపర మార్కెట్‌కు ప్రస్తుతం అరటి గెలలు అతి తక్కువగా వస్తున్నాయి. దీంతో అరటి గెలల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా అరటి గెలల ధరలు పలకటంతో రైతులు ఆశ్చర్య పోతున్నారు. ఈ మార్కెట్‌లో సీజన్‌లో ప్రతి రోజూ సుమారు అయిదు వేల నుంచి ఆరువేల వరకు అరటి గెలలు క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. అటువంటిది కృష్ణానదికి వచ్చిన వరదలు కారణంగా అరటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో మార్కెట్‌కు అతి తక్కువగా గెలలు వస్తున్నాయి. అరటికాయల మార్కెట్‌లో చక్కెరకేళికి మరింత డిమాండ్ పెరిగింది. ప్రతి సంవత్సరం మార్చి నెలలో చక్కెరకేళి గెలలకు ధర తక్కువగా ఉండటంతో రైతులు ఈ సంవత్సరం చక్కెరకేళి తోటలను తక్కువగా వేశారు. దీనికి తోడు కృష్ణానదికి వచ్చిన వరదలు కారణంగా చక్కెరకేళి అరటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో ఈ సంవత్సరం చక్కెరకేళి గెలలకు రెక్కలు వచ్చాయి. మార్కెట్‌కు చక్కెరకేళి గెలలు తక్కువగా రావటంతో గెలల ధరలు అమాంతంగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. కొల్లిపర మార్కెట్‌కు మాచర్ల, దాచేపల్లి, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, అమరావతి, రావులపాలెం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి చక్కెరకేళి గెలలను పోటీలు పడి కొనుగోలు చేస్తున్నారు. నెల రోజుల క్రితం చక్కెరకేళి అరటిగెల ధర మొదటి రకం 130 రూపాయల నుంచి 180, రెండోరకం 100 నుం చి 150 రూపాయలు ధర పలికింది. ప్రస్తుతం మార్కెట్‌లో మొదటి రకం చక్కెరకేళి ధర 350 రూపాయల నుంచి 400 రూపాయల వరకు, రెండో రకం 200రూపాయల నుంచి 270 వరకు ధర పలుకుతోంది. దీంతో అరటి తోటలు ఉన్న రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండటంతో కొంత మంది వ్యాపారస్తులు చక్కెరకేళి గెలలను తోటల్లోనే కొనుగోలు చేసి మినీలారీల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. రైతులు కూడా ఖర్చులు తగ్గుతాయని తోటల్లోనే గెలలను అమ్మటానికి సిద్ధపడుతున్నారు.



మినీలారీకి ఎగుమతి చేస్తున్న చక్కెరకేళి గెలలు

సంక్షేమం.. సులభం

(5వ పేజీ తరువాయి)

గణనీయ సంఖ్యలోనే ఉన్నాయి. బాపట్ల జిల్లాలో 5,58,327 ఇళ్లు ఉండగా ఇప్పటి వరకు 5,58,257 నివాసాలు జియోట్యా గింగ్ పూర్తయింది. గుంటూరు జిల్లాలో 7,42,211 ఉండగా ఇంకా 5,023 నివాసాలు పెండింగ్‌లో ఉన్నాయి. పల్నాడు జిల్లాలో 7,09,831 ఇళ్లకు 13,237 ట్యాగ్ చేయాల్సి ఉంది.

వైసీపీ హయాంలో లూటీ

సంక్షేమ పథకాలను పెద్దఎత్తున అమలు చేస్తున్నామనే నెపంతో ప్రభుత్వ ధనాన్ని గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు లూటీ చేశారు. ఇదే విషయంలో గతంలోనే పలు సర్వేల్లో బట్టబయలైంది. ఇప్పటికే గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలలో దుర్వినియోగానికి సంబంధించి పెద్దఎత్తున విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. వివిధ విభాగాలలో జరుగుతున్న క్షేత్ర స్థాయి విచారణలో ఈ డేటాను సహాయకారిగా వాడుకుంటూ నిజాలు నిగ్గుతేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గత ఏలుబడిలో ఎంతమేర నిధులు అర్హత లేని వారికి దోచిపెట్టారో తెలుసుకోవడంతో పాటు, ఆ ఏడాది ముగిసేలోగానే ఈ ప్రక్రియను పూర్తి చేయాలనే ఆదేశాలు జిల్లా అధికారులకు వచ్చాయి.

జియోట్యాగింగ్‌లో జాప్యం..

జియోట్యాగింగ్ గతేడాది నవంబరులో మొదలైన ఈ జియోట్యాగింగ్ డిసెంబరు చివరికల్లా ముగించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఏడాది మారి రెండు నెలలు దాటినా ఇంకా ప్రక్రియ సాగుతూనే ఉంది. సరిపడా సిబ్బంది లేకపోవడం, కొంతమంది సిబ్బందికి సహకరించకపోవడం, ప్రణాళికా లేమితో వందశాతం జియో ట్యాగింగ్ జరగలేదు. క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, జియో ట్యాగింగ్ అనేసరికే చాలామంది విముఖత చూపుతున్నారని, వారికి అవగాహన కల్పించి ప్రక్రియ చేపట్టేసరికి ఆలస్యం అవుతందనేది సిబ్బంది వాదన. కొంతమంది అందుబాటులో లేకపోవడం తోడు గత ప్రభుత్వంలో ఇష్టారీతిన ఇళ్ల నమోదు కూడా జాప్యానికి కారణంగా ఉందని యంత్రాంగం వాపోతోంది.

మానవత్వంతో సేవలందించండి

- ● ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ నరసింహం ఉద్బోధ
- ● ఘనంగా జీఎంసీ 74వ స్నాతకోత్సవం

గుంటూరు మెడికల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిలో నైతిక విలువలు ముఖ్యమని, వైద్యులు మానవతా దృక్పథంతో రోగులకు సేవలు అందించాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వ విద్యాలయం ఉప కులపతి, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం పిలుపునిచ్చారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కళాశాల 74వ స్నాతకోత్సవం 'కార్డియా 25'లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిం చారు. ఈ స్నాతకోత్సవంలో 2019 బ్యాచ్ విద్యార్థులకు వైద్య పట్టాలను వీసీ ప్రదానం చేశారు. తొలుత వీసీ డాక్టర్ నరసింహం, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి, ప్రభుత్వాస్పత్రి సూప రింటెండెంట్ డాక్టర్ రమణయశస్వి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభించారు. వైద్యరంగంలో కృత్రిమ మేధ, రోబోటిక్ సర్జరీ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్నా, రోగులపట్ల ప్రేమతో వైద్యం అందించే డాక్టర్లకు అవి ప్రత్యా మ్నాయం కాబోవని డాక్టర్ నరసింహం తెలిపారు. వ్యాధికి చికిత్స చేస్తున్నట్లు భావించకుండా, రోగికి చికిత్స చేస్తున్న విషయం గుర్తుంచుకుంటే తప్పనిసరిగా వారు వైద్య వృత్తిలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని ఆయన వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి మాట్లాడుతూ వైద్య రంగం వ్యాపారంగా మారిందని, చాలా మంది వైద్యులు కఠినంగా, యంత్రాల్లా పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులను డబ్బులు వసూలు చేసే యంత్రాల్లా భావించడం సమంజసంకాదని వారి పట్ల ప్రేమతో, దయతో సేవలు అందించాలని కోరారు.

రూ.100 కోట్లతో ఎంసీహెచ్ బ్లాక్..

సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ జీఎంసీలో చదివి అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ మాతృ విద్యా సంస్థ కోసం జీజీహెచ్‌లో రూ.100 కోట్లతో నిర్మిస్తున్న ఎంసీహెచ్ బ్లాక్ 2026 జనవరి నాటికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ బ్లాక్‌లో అవసరమైన వైద్య పరికరాలను రూ.40 కోట్లతో కొనుగోలు చేసి ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం 2019 బ్యాచ్ వైద్య విద్యార్థులకు డీఎంఈ డాక్టర్ నరసింహం పట్టా లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైద్య వృత్తి ప్రమణా లను కాపాడతామని, రోగుల పట్ల దయతో, ప్రేమతో వ్యవహ రిస్తామని వారితో హిపోక్రాటిక్ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జీఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బీ శ్రీధర్, డాక్టర్ కే ప్రభాకరరావు, జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ హనుమంతరావు పాల్గొన్నారు.



కళాశాల ప్రాంగణంలో యువ వైద్యుల ఆనందహేళ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వైస్‌చాన్సలర్ డాక్టర్ నరసింహం



7 నుంచి చిలకలూరిపేటలో టెన్నిస్ టోర్నమెంట్

చిలకలూరిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల స్థాయిలో టెన్నిస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు టోర్నమెంట్ నిర్వాహక కమిటీ వారు మంగళవారం తెలిపారు. మెన్ డబుల్స్ విభాగంలో 35, 45, 55, 65 ప్లస్‌ల వారికి ఈ పోటీలు జరుగుతాయన్నారు. మొత్తం 75టీములు, 150 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. సీఆర్ క్లబ్ వారి సహకారంతో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌ను క్లబ్ ఉపాధ్యక్షుడు సీహెచ్ కాంతయ్య ప్రారంభిస్తారు. క్లబ్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.నరసింహారావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

8న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ నెల 8న నరసరావుపేట మండల న్యాయ సేవాధికారి ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్ పదమూడో అదనపు జిల్లా న్యాయధికారి ఎన్ సత్యశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదాలత్‌లో నరసరావుపేట కోర్టు పరిధిలో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ముందస్తువ్యాజ్యాలు తదితర అన్ని కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చు అన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కక్షిదారులు తమ సమయాన్ని డబ్బును ఆదా చేసుకోవచ్చు అన్నారు. సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నట్లయితే కోర్టు ఫీజు వాపసు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రతి రైతు గుర్తింపు కార్డు పొందాలి: ఏవో

నాదెండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల ద్వారా సొంత భూమి ఉన్న ప్రతి రైతు గుర్తింపు కార్డు తీసుకోవాలని వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాదు అన్నారు. సాతులూరులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాదు మాట్లాడుతూ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేందుకు ప్రతిరైతు గుర్తింపు కార్డు పొందాలన్నారు. మొక్క జొన్న, వరి పైరులలో ఎలుకల నివారణకు యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏఈవో జీవా నాయక్, సహాయకులు రామారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గణపవరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం హైవేపైన స్తంభాలు, లైన్‌ల మార్పిడి కారణంగా చవిటిపాలెం, వేలూరు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. గృహ, వాణిజ్య, చిన్న, భారీ తరహాల పరిశ్రమలకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

దేవాలయానికి విగ్రహాల తరలింపు

నాదెండ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులో రెడ్డిపేరంటాలమ్మ తల్లి దేవాలయం పునఃర్నిర్మాణం పూర్తవ్వటంతో పునఃప్రతిష్ఠకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 17వ తేదీన నిర్వహించే పునఃప్రతిష్ఠా కార్యక్రమానికి అమ్మవార్ల నూతన విగ్రహాలను దేవాలయానికి తరలించారు. ఒంగోలు నుంచి మంగళవారం ప్రత్యేక వాహనంలో తీసుకు వచ్చిన ఈ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన చిన్నకంచెర్ల చేపల చెరువు వేలం

చిన్నకంచెర్ల (శావల్యాపురం) మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకంచెర్లలోని మేడిచెరువులో చేపల పెంపకానికి సంబంధించిన బహిరంగ వేలంను మంగళవారం నిర్వహించారు. వివిధ కారణాలతో మేడిచెరువు వేలం పలుమార్లు వాయిదా పడింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 1434, 1435 ఫసలీలకు వేలంలో పాల్గొన్న వారి వద్ద రూ.లక్ష డిపాజిట్ సేకరించి డీఎల్‌పీవో వీవీఎం లక్ష్మణారావు వేలంను నిర్వహించారు. గ్రామానికి చెందిన మదమంచి సామ్రాజ్యం గరిష్ఠంగా రూ.3,70,000లకు వేలంపాట దక్కించుకొన్నారు. వేలం ముగియగానే పాటదారులు మొత్తం నగదును చెల్లించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ పూరేటి నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, సీహెచ్.లలితాశ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై మహిళలకు అవగాహన

ఈపూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చునని డాక్టర్ నవీన్ అన్నారు. ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్యకర జీవితంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నవీన్ హెల్త్ డైట్, పలు వ్యాధులను గుర్తించడంపై అవగాహన కల్పించారు. యోగా, వ్యాయామంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో సీడీపీవో అరుణ, సూపర్‌వైజర్లు చిన్నమ్మాయి, శ్రీదేవి, రాజ్యలక్ష్మి, ఎస్కే మస్తాన్‌వలి, పద్మజారాణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జోన్ డైరీ

● యడ్లపాడు: మండలంలోని కారుచోల-గుత్తావారిపాలెం గ్రామాల మధ్య వీబీసీ కాలువ గట్టుపై ఉన్న శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయ 35వ వార్షిక తిరునాళ్ళ మహోత్సవం బుధవారం జరుగుతుందని ఆలయ అర్చకులు జంధ్యాల మల్లికార్జునశర్మ తెలిపారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

● రూ.లక్షల వ్యయంతో నిర్మించినా నిరుపయోగంగా ఆరోగ్య క్లినిక్, రైతు సేవా కేంద్రం
● పట్టించుకోని అధికారులు, స్థానిక నాయకులు



నడిగడ్డలో రైతు కూలీలకు ఆవాసంగా మారిన రైతు సేవా కేంద్రం, దొండపాడులో పశువులకు ఆవాస కేంద్రంగా మారిన ఆరోగ్య క్లినిక్ భవనం

వినుకొండ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పాలకుల నిర్లక్ష్యానికి గ్రామాల్లో లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టిన రైతు సేవా కేంద్రం భవనాలు, ఆరోగ్య క్లినిక్ భవనాలు అసంపూర్తి నిర్మాణాలతో నేడు నిరుపయోగంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో ప్రధానంగా ఆర్‌ఎస్‌కేతో పాటు ఆరోగ్య క్లినిక్‌లు, సచివాలయాల నిర్మాణాలపై దృష్టి సారించి నిర్మాణాలు చేపట్టింది. కొన్ని గ్రామాల్లో స్థానిక నాయకుల అభీష్టం మేరకు అనుకున్న లక్ష్యాలను పూర్తిచేసినా మరికొన్ని గ్రామాల్లో మాత్రం నేటికీ అవి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. నడిగడ్డ సమీపంలోని రైతు సేవా కేంద్రంతో పాటు ఆరోగ్య క్లినిక్‌లు అసంపూర్తిగా ఉండటంతో నేడు అవి మిర్చి కూలీలకు ఆసరా ఇచ్చే గృహాలుగా మరాయి. ఇదిలా ఉండగా దొండపాడులో కొంత మేరకు బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో పశు ఆవాస కేంద్రాలుగా మారాయి. అధికారులు స్పందించి రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భవనాలపై అధికారులు, స్థానిక నాయకులు శ్రద్ధచూపి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

భవన నిర్మాణాలకు మునిసిపల్ అనుమతులు అవసరం లేదు

గుంటూరు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మధుకుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పి.మధుకుమార్

చిలకలూరిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలలో భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా చేసిన మార్పులు, తాజా ఉత్తర్వులకు అనుగుణంగా సంబంధిత అధికారులు వ్యవరించాలని గుంటూరు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమార్ మంగళవారం అన్నారు. పట్టణంలోని గ్రాండ్ వెంకటేష్ ఫంక్షన్ హాలులో ఇందుకు సంబంధించి వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ళ, గురజాల, చిలకలూరిపేట, దాచేపల్లి మునిసిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, వార్డు ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలు, జిల్లాలోని లైసెన్సుడు టెక్నికల్ పర్సన్స్, బిల్డర్స్‌తో అవగాహన సమావేశం చిలకలూరిపేట మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు అధ్యక్షతన జరిగింది. మధుకుమార్ మాట్లాడుతూ ఇకనుంచి భవన నిర్మాణాలకు మునిసిపాలిటీల అనుమతులు అవసరంలేదని చెప్పారు. లైసెన్సుడు టెక్నికల్ పర్సన్స్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూపొందించిన ప్లాను ప్రకారం భవనాలు నిర్మించుకోవచ్చునన్నారు. భవనాల నిర్మాణం అందుకు విరుద్ధంగా జరిగితే మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ప్లానింగ్ ఆఫీసర్ జి.సుబ్బారెడ్డి, పిడుగురాళ్ళ కమిషనర్ పి.శ్రీధర్, వినుకొండ కమిషనర్ ఎం.సుభాష్‌చంద్రబోస్, మాచర్ల కమిషనర్ డి.వేణుబాబు, దాచేపల్లి కమిషనర్ ఎంవీ అప్పారావు, గురజాల కమిషనర్ ఎస్ శివన్నారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్ బి.సునీత, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ పూర్ణచంద్రారెడ్డి, చిలకలూరిపేట టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కె సుజాత పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

● మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్



ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులతో చర్చిస్తున్న మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

వినుకొండ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని పట్టణంలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలసి తాగునీటి సమస్యపై చర్చించారు. ప్రధానంగా పట్టణంలో చేతపంపులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, నిరుపయోగంగా ఉన్న చేతిపంపులకు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర విజన్‌లో భాగంగా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు సీడీఎంఏ సూచన మేరకు మార్చి 3వ శనివారంలోపు థీమ్ సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధం, 120 మెట్రిక్ మైక్రాన్‌ల కన్నా తక్కువ గల ప్లాస్టిక్ నిషేధం గురించి అధికారులకు వివరించారు.

నూరు శాతం పన్నుల వసూలు లక్ష్యంగా పనిచేయాలి

మునిసిపల్ కమిషనర్ జస్వంత్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ జస్వంత్ రావు

నరసరావుపేట రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నూరు శాతం పన్నుల వసూలు లక్ష్యంగా పనిచేయాలని నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ జస్వంత్ రావు అధికారులను ఆదేశించాడు. నరసరావుపేట మునిసిపల్ కార్యాలయంలో పన్నుల వసూలుపై అధికారులతో మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలో నూరుశాతం పన్నులు వసూలు చేసేలా అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 31వ తేదీతో 2024-2025 ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో నరసరావుపేట పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ఆస్తి, నీటి పన్ను వసూలును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. నరసరావుపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన, పాత భవనాలపై అదనంగా నిర్మించిన భవనాలను గుర్తించి పన్ను విధించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ బి కనకారావు పురపాలక సంఘం రెవెన్యూ అధికారి కే శ్రీనివాసరావు మునిసిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.బెయిలిబాబు, సయ్యద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమిపై నమ్మకానికి నిదర్శనం ఆలపాటి గెలుపు: జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై యువత నమ్మకానికి నిదర్శనం పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాంజేంద్ర ప్రసాద్ గెలుపు అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి ఎన్ని కుయుక్తులు పన్నినా, నేరుగా బరిలోకి దిగినా ఉమ్మడి కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో పట్టభద్రుల తీర్పు చెక్కు చెదరని వారి నమ్మకానికి నిదర్శనంగా పేర్కొన్నారు. వైసీపీకి, జగన్‌కు ఆత్మసాక్షి లాంటివి ఏమైనా ఉంటే ఇకనైనా తప్పుడు ప్రచారాలు, ప్రభుత్వంపై అసత్యాలు, నిందలతో యువతను రెచ్చగొట్టాలనే దురాలోచనలు మానుకోవాలని హితవు పలికారు. విద్యావంతుల్లో ఈ ఏకపక్ష ఫలితాలకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రతోనే బాటలు పడ్డాయని పేర్కొన్నారు.

ఆలపాటి గెలుపు ప్రజా విజయం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు ప్రజా విజయం అని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం అన్నారు. ఆలపాటి విజయం కూటమి ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనం అన్నారు. బ్యాలెట్ ఎన్నికలలోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధించడం, పట్టభద్రులు తమ ప్రభుత్వాన్ని ఆదరించడం శుభపరిణామన్నారు. 82వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో ఆలపాటికి పట్టభద్రులు పట్టం కట్టడం ప్రభుత్వంపై వారికున్న నమ్మకాన్ని తెలియచేస్తున్నదని వివరించారు. సభలో ఆలపాటి ప్రజాసమస్యల పరిష్కారానికి తగిన కృషి చేస్తారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియచేస్తున్నానన్నారు.

ఆలపాటికి టీడీపీ నేతల అభినందనలు

వినుకొండ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా,గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో ఆధిక్యంతో భారీ విజయం సాధించిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను శివశక్తి ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ గాలి రమణ, డీసీ గంగినేని రాఘవలు సోమవారం గుంటూరు లక్ష్మీపురంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు. ఆయనను కలిసినవారిలో రమేష్, ఫౌండేషన్ మేనేజర్ దిలీప్‌కుమార్, వినుకొండ ఎన్నికల పరిశీలకులు పంచుమర్తి భూపతిరావు తదితరులు ఉన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



ఆటల్లో ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులను అందచేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ కలిగిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు అని నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. స్థానిక కేసానుపల్లి పంచాయతీ పరిధిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, నరసరావుపేట శాసన సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లావు శ్రీకృష్ణ మాట్లాడుతూ ఆటల ద్వారా దృఢత్వం మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు నరసరావుపేట ఎంపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు, కళాశాల డైరెక్టర్ నాగోతు సవిత, పాతూరు చక్రధర్ స్కూల్ ప్రిన్సిపాల్ అల్పన వునియాల్, పట్టణంలోని ప్రముఖ వైద్యులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పలు కళాశాలల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సపాలెంలో మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి జూలకల్లుకు చలంచర్ల వెంకటేశ్వర్లు, కుసుమాంబ దంపతులు విరాళం అందజేశారు. మంగళవారం విరాళం రూ.1,01,116ను కార్య నిర్వహణ అధికారి నలబోతు మాధవీదేవికి అందజేశారు. దాతలకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రీ సర్వే పాపాలను సరిదిద్దాలి

● శాసన సభలో ప్రస్తావించిన ప్రత్తిపాటి



చిలకలూరిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): 22ఏ నిషేధిత భూముల జాబితా సమస్యలు, వైసీపీ ప్రభుత్వ రీసర్వే పాపాలను సరిదిద్ది రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో నిషేధిత జాబితా భూముల రైతుల బాధలను ప్రభుత్వం దృష్టికి ప్రత్తిపాటి పుల్లారావు తీసుకువెళ్ళారు. గత ప్రభుత్వం రీసర్వే ప్రక్రియను ప్రహసనంగా మార్చి రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని, సొంత పార్టీవారికి మేలు చేసిందని చెప్పారు. దేవదాయ శాఖ తప్పిదంతో దాదాపు 12లక్షల ఎకరాల భూములు 22ఏ (1సి) జాబితాలో నమోదయ్యాయని పేర్కొన్నారు. 2019లో టీడీపీ ప్రభుత్వం 22ఏ భూముల సమస్య పరిష్కారానికి ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో దాన్ని చట్టంగా మార్చకుండా, నిబంధనలకు విరుద్ధంగా రీసర్వే చేపట్టిందని వివరించారు. అయితే రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోలేదని అన్నారు. ప్రత్తిపాటి లేవనెత్తిన ప్రశ్నకు కొనసాగింపుగా టీడీపీ ఎమ్మెల్యేలు కూన రవికుమార్, శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), బోనెల విజయ చంద్ర కూడా 22ఏ భూముల జాబితా, రీసర్వే సమస్యలను సభలో ప్రస్తావించారు.



ఎలుకల మందు తయారీని పరిశీలిస్తున్న ఏవో శివలలిత

సామూహిక ఎలుకల నివారణ చేపట్టాలి: ఏవో

రొంపిచర్ల, మార్చి 4 (ఆంధ్రజోతి): మండలంలోని రైతులు సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారి శివ లలిత మంగళవారం తెలిపారు మండలంలోని అన్ని గ్రామాల్లో రబీ సాగులో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలుకల మందు తయారుచేసి రైతులకు అందజేశారు. వరితో పాటు మిగిలిన పంటలకు ఇబ్బంది కలిగిస్తున్న ఆ పంటలకు కూడా ఈ మందును వినియోగించవచ్చని తెలిపారు. రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నల్లిదోమ సోకిన పంట పొలాలను పరిశీలిస్తున్న హార్టీకల్చర్, వ్యవసాయ శాఖ అధికారులు

హార్టీకల్చర్ అధికారుల పరిశీలన

వినుకొండటౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్రగడ్డపాడు సమీపంలో సుమారు 200 ఎకరాలకు పైగా మిర్చి పంట పండించి నష్టాలకు గురైన రైతులపై ఫిబ్రవరి 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'నల్లిదోమతో మిర్చి రైతు కుదేలు' కథనంపై వ్యవసాయ శాఖ అధికారులతో పాటు హార్టీకల్చర్ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. సిబ్బంది సాయంతో చాట్రగడ్డపాడు గ్రామస్థులు పండిస్తున్న మిర్చి పంటలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. హార్టీకల్చర్ అధికారి నబీ రసూల్ మాట్లాడుతూ నల్లి దోమ అరికట్టడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దోమ తాకిడి అధిక పెట్టుబడులు పెట్టడంతో పాటు ఆశించిన మేర దిగుబడులు లేకపోవడంతో రైతులు ఎకరాకు లక్ష రూపాయల మేర నష్టపోయారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సహజంగా డిసెంబరు, జనవరి నెలల్లో పంటకు వ్యాపించే నల్లి దోమ ఈ ప్రాంతంలో విజృంభించిందని వేడితాకిడిని కూడా తట్టుకొని మిర్చి పండిస్తున్న రైతులకు కన్నీరు తెప్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా దగ్గుల రామకోటిరెడ్డి మాట్లాడుతూ మిర్చి పండిస్తున్న రైతులంతా తీవ్రంగా నష్టపోయారని, కనీసం ఒక్క కోత కోసినా కూలి రాని పరిస్థితి ఈ ప్రాంతంలో ఉందని, ఖర్చులు భరించి కోత కోసినా తాలు కాయల తాకిడికి క్వింటా రూ.8వేలు ధర పలకడం లేదని, తాలు కాయలు ఏరిన కాయలకు మాత్రం రూ.11వేల నుంచి రూ.12వేలు ధర పలకడంతో కోత కోసిన కూలీలకు కూడా డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా గ్రామంలోని పంటలు పండిస్తున్న రైతులకు ఈ - క్రాప్ నమోదు చేస్తున్నట్లు ఏఈవో సునీత తెలిపారు. ఈ నెల 6వ తేదీ లోపు రైతులు పండిస్తున్న పంటలకు ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు.

ఓబన్న విగ్రహావిష్కరణకు ఎంపీకి ఆహ్వానం

నరసరావుపేట టౌన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో స్వాతంత్ర్య సమరయోదుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ ఈ నెల 16న జరుగుతుందని టీడీపీ వడ్డెర సాధికార సమితి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలకొండ నరసింహారావు మంగళవారం తెలిపారు. విగ్రహావిష్కరణకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును నరసరావుపేట ఎన్జీవో కాలనీలో ఉన్న ఎంపీ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఎంపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాచర్ల పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమర దుర్గారావు, విగ్రహ కమిటీ అధ్యక్షుడు కొమెర అనంతరాములు, చెల్లా పిచ్చెయ్య, తమ్మిశెట్టి కోటేశ్వరరావు, కనిగిరి బాలు, కుంచాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సాయిసాధన చిట్‌ఫండ్ బాధితులు

లోకేశ్‌ను కలిసిన సాయిసాధన చిట్‌ఫండ్ బాధితులు

నరసరావుపేట టౌన్, మార్చి 4 (ఆంధ్ర జ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో సాయిసాధన చిట్‌ఫండ్ బాధితులు కలిసి వినతిపత్రం అందజేసినట్లు యామిని రామారావు మంగళవారం తెలిపారు. బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, ప్రభుత్వ చీఫ్‌విప్, జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో హోంమంత్రి వంగలపూడి అనిత, నారా లోకేశ్‌ను కలిసి పరిస్థితి వివరించారు, కార్యక్రమంలో చేకూరి సాంబశివరావు, రాధాకృష్ణ, ఈఎం స్వామి, గట్టు సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

వైభవంగా బొగ్గరం తిరునాళ్ళ

ఈపూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొగ్గరం ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ మంగళవారం వైభవంగా జరిగింది. తిరునాళ్ళను పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. మహిళలు పొంగళ్ళు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అదేవిధంగా భూదేవి, శ్రీదేవి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరిపించారు. గ్రామస్థులు ఐదు భారీ విద్యుత్ ప్రభలు నిర్మించి వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తిరునాళ్ళ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు.